క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గ్రామ పెద్దలు వియ్యపు వరహాలు, చొప్పారాజు, అల్లు మోహన్ పాల్గొన్నారు.రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పాయకరావుపేట: అసోసియేషన్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ మ్యాథ్స్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నవంబర్ నెలలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సిహెచ్.సాయి హేమంత్ (ఎనిమిదో తరగతి), ఎన్.లాస్య (ఆరో తరగతి) అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.ఎస్ మూర్తి, హెచ్‌ఎంవో డి.వి. శ్రీనివాస్ అభినందించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. శ్మశాన వాటిక, జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి పరిసరాలు, పలు వీధుల్లోను పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పూడికలు తీయించి, చెత్తను తొలగింపజేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలని వీధుల్లో చెత్తను ఇష్టానుసారం వేయొద్దని సూచించారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి మంగళవారం వాడ్రాపల్లి ఆర్‌బీకే ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలను రాయితీపై అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ తులసి పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



ఒంపోలులో బీమా చెక్కు అందజేస్తున్న విశాఖడెయిరీ జోనల్ మేనేజర్ రమణ

మునగపాక: ప్రతి ఒక్కరూ విశాఖడెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ జోనల్ మేనేజర్ శరగడం రమణ కోరారు. మండలంలోని ఒంపోలు పాలకేంద్రం ఆవరణలో ముగ్గురు పాడి రైతులకు రూ.90వేల బీమా చెక్కులను మంగళవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి, సూపర్‌వైజర్ ఆదిఅప్పారావు, వేతన కార్యదర్శి నాయుడప్ప పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు నేడు

మునగపాక : మునగపాక గౌరీ పరమేశ్వరుల పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ,గౌరవ అధ్యక్షుడు పొలిమేర అప్పలనాయుడు, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న జరగనున్న ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం 4గంటల నుంచి గ్రామంలోని అన్ని వీధుల గుండా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

- ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి
- ఎమ్మెల్యే కన్నబాబురాజు



రామారాయుడుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని యలమంచిలి పట్టణం 24వ వార్డు రామారాయుడుపాలెం వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారితో కలసి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా ప్రజలను వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొని కళ్లారా చూసినందువల్ల ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందని అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో ప్రతి వార్డులో రక్షిత మంచి నీటి పథకం ద్వారా తాగునీరు అందించేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయని, 24వ వార్డులో పలు అభివృద్ధి పనులకు నిధులు అధిక శాతం మంజూరు చేశామని, 24వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజి సదుపాయం కల్పించి, నాడు నేడు పథకాల ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేశామని, యలమంచిలి పట్టణంలో శాశ్వత మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్నామని, యలమంచిలి పై వంతెన నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. రామారాయుడు పాలెం వద్ద పలు అభివృద్ధి పనులు చేసేందుకు మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. స్థానిక నాయకులు ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సచివాలయ అధికారులు వలంటీర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గూర్చి ప్రతి ఒక్కరికీ తెలియపరచాలని, సచివాలయ కన్వీనర్లతో కలసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, వార్డు కౌన్సిలర్లు, మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా శిక్షణ కేంద్రం

- స్వచ్ఛ సంకల్పంపై స్థానిక ప్రతినిధులకు శిక్షణ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీడీవో



శిక్షణ కోసం తీర్చిదిద్దిన శిక్షణ కేంద్రం

నక్కపల్లి: జగనన్న స్వచ్ఛ సంకల్పం, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు నక్కపల్లిలో చెత్తనుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. ఇక్కడ త్వరలో నర్సీపట్నం డివిజన్ పరిధిలో 8 మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, పంచాయతీ స్వీపర్లకు క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వనున్నారు. సుమారు వెయ్యి మందికి పైగా స్థానిక ప్రతినిధులు, కార్యదర్శులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని సదుపాయాలు కల్పించారు. శిథిలావస్థకు చేరిన ఈ సంపద తయారీ కేంద్రాన్ని ఉన్నతాధికారుల ఆదేశాలతో పంచాయతీ వారు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తడి పొడి చెత్తను తీసుకు వచ్చి నిల్వ చేయడం, వేరు చేసేందుకు వేర్వేరుగా కుండీలు ఏర్పాటు చేశారు. చెత్తను, వానపాములను ఉపయోగించి వర్మి కంపోస్టు తయారీ చేసే యూనిట్‌ను కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడకు హాజరయ్యేవారికి చెత్త నుంచి సంపద తయారీ చేసే విధానంపై వారం రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఏవిధంగా రీసైక్లింగ్ చేసి రోడ్ల నిర్మాణంలో ఉపయోగిస్తారో అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ వీసం రాజు పరిశీలించారు.

విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- సీఎం నిర్ణయం హర్షణీయం
- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం



వీసం రామకృష్ణ, తదితరులు

నక్కపల్లి : విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ రాజధాని కాబోతోందని, త్వరలోనే సీఎం కార్యాలయం అక్కడకు మార్చబోతున్నామంటూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పార్టీ సీనియర్ నేత వీసం రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనా వికేంద్రీకరణకు కట్టుబడి ఉందన్న విషయం జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేశారన్నారు. మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయాలని, మొదటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. విశాఖను పరిపాలనా రాజాధాని చేయడం వల్ల ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోతుందన్నారు. రూ.వేలకోట్లు ఖర్చు చేసి చంద్రబాబు అమరావతిలో శాశ్వత భవనాలు నిర్మించలేదని, కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే మూడు పంటలు పండే 30 వేల ఎకరాలను రాజధాని పేరుతో సేకరించారన్నారు. పరిపాలనా రాజధానికి అవసరమైన అన్ని అర్హతలు, మౌలిక సదుపాయాలు, వనరులు విశాఖపట్నానికి ఉన్నాయన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి ఎన్‌టీఆర్ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో జరగనుందని, ఈ కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కౌన్సిలర్లు నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొనాలని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు లక్ష్మీమాధవస్వామి కల్యాణోత్సవం

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీమాధవస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. తీరాన గల హేమగిరి పర్వతంపై లక్ష్మీమాధవ స్వామి కల్యాణం 1965 నుంచి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అలయ కమిటీ చైర్మన్ పేరిచర్ల శ్రీరామ్మూర్తిరాజు తెలిపారు. ఈ కళ్యాణ వేడుకలు పురస్కరించుకుని గ్రామంలో అయిదు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, ఆదివారం స్వామివారి చక్రస్నానం పురస్కరించుకుని మాఘపౌర్ణమి జాతర నిర్వహిస్తామని తెలిపారు. కాగా మాఘ పౌర్ణమి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఎస్ఐ ప్రసాద్‌రావు సర్పంచ్ లోవరాజు,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఆలయకమిటీ చైర్మన్ శ్రీరామ్మూర్తిరాజుతో చర్చించారు.

పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జ్‌ల పదవీకాలం పొడిగింపు



పాయకరావుపేట పీఏసీఎస్ పర్సన్ ఇంఛార్జిగా ఉత్తర్వులు తీసుకున్న రాజేష్‌ఖన్నా

పాయకరావుపేట : మండలంలో గల మూడు పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జ్‌ల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. శ్రీరాంపురం పీఏసీఎస్‌కు చిక్కాల సత్య సుబ్బలక్ష్మి, పాయకరావుపేట పీఏసీఎస్‌కు దేవవరపు రాజేష్‌ఖన్నా, నామవరం పీఏసీఎస్‌కు కె.సుందరలతతో పాటు ఇద్దరేసి డైరెక్టర్ పదవులు సైతం రెన్యూవల్ అయ్యాయి. ఈ ఉత్వర్వులను సహకార శాఖ అధికారులు పర్సన్ ఇంచార్జ్‌లకి అందించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పీఏసీఎస్ పర్సన్ ఇంఛార్జి దేవవరపు రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ తమ పదవులను ఆరు నెలల పాటు కొనసాగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నక్కపల్లి : మండలంలో మూడు పీఏసీఎస్‌ల పర్సన్ ఇంఛార్జిల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. నక్కపల్లికి యలమంచిలి తాతబాబు, గొడిచెర్లకు బొల్లం అప్పలకొండ, వేంపాడుకు సూరాకాసులు రామలక్ష్మితో పాటు ఒక్కో పీఏసీఎస్‌కు నియమించిన ఇద్దరేసి డైరెక్టర్ పదవులు సైతం రెన్యువల్ అయ్యాయి. ఈ ఉత్తర్వులను సహకార శాఖాధికారులు పర్సన్ ఇంచార్జ్‌లకి అందించారు.

సత్వర చికిత్సతో కుష్టు నివారణ



తోటాడలో కుష్టువ్యాధి నివారణ ర్యాలీ

మునగపాక : కుష్టు రోగులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. మంగళవారం తోటాడ పంచాయతీలో కుష్టువ్యాధి నివారణ ర్యాలీ నిర్వహించారు. శరీరంపై మచ్చలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఎటువంటి అంగవైకల్యం లేకుండా బయటపడవచ్చన్నారు. ఆరోగ్య వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి,కేంద్రం నిర్వాహకులు ప్రియాంక,ఆశ కార్యకర్తలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ఆలీ

మునగపాక : కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మెలగాలని మునగపాక ఎస్ఐ మహ్మద్ ఆలీ కోరారు. మండలంలోని మెలిపాక దళితవాడలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

దళితవాడల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో అన్ని కులాల వారు సోదరభావంతో మెలగాలన్నారు. అంటరానితనం రూపు మాపేందుకు పాటుపడాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు, దళిత విభాగం మండల అధ్యక్షుడు మందా రాము, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శ్రీనివాసరావు, దళితులు అనిల్‌కుమార్, బీలా శివగణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోనల్ మలేరియా అధికారి సందర్శన



గంటవానిపాలెంలో పర్యటిస్తున్న జోనల్ మలేరియా అధికారి మధుసూధనరావు

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విశాఖ జిల్లా జోనల్ మలేరియా అధికారి మధుసూదనరావు కోరారు. మండలంలోని గంటవానిపాలెంలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో మలేరియా సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి దొర, సబ్ యూనిట్ అధికారి శ్రీను, చూచుకొండ పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, వైద్య సిబ్బంది నాయుడు, కృష్ణ, పార్వతి పాల్గొన్నారు.

ఆర్‌డీవో ఆకస్మిక సందర్శన

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం ఎస్ఏవోబీ సమస్యలు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం ఆర్డీవో ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై త్వరితగతిన నివేదికలు సమర్పించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో భూ రక్షా సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ, అనాదీనం భూములు వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు.ఈ సందర్శనలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్ ఉన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ విభీషణరావు, ఆదిమూర్తి



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రావికమతం: కొత్తకోటలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలు మంగళవారం ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 11 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. వీటిని ఎస్ఐ విభీషణరావు, జెడ్పీటీసీ భర్త ఆదిమూర్తి ప్రారంభించారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. సర్పంచ్ ఉప సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు చీడికాడ అభయాంజనేయ తీర్థం

చీడికాడ: స్థానిక అభయాంజనేయ స్వామివారి తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు వసూళ్లకు చెక్

- ఒక్కో సిలిండర్‌కు రూ.50 చెల్లించాల్సిందే
- మండలంలో అదనపు వసూళ్లు రూ.22.50 లక్షలు
- ప్రభుత్వ తాజా ఉత్తర్వులపై ప్రజల్లో అవగాహన



ఆటోపై ఇంటి వద్దకు తరలిస్తున్న గ్యాస్ సిలిండర్లు

తుమ్మపాల : ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల పేరిట జరిగే అక్రమ వసూళ్లకు ప్రభుత్వం అడ్డకట్ట వేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని నిబంధనలను జారీ చేసింది. గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ చార్జీల పేరిట ఇష్టారీతిన వసూలు చేయడంపై ప్రజల్లో ఎప్పటి నుంచో ఆక్షేపణలున్నాయి. గత ప్రభుత్వాలు దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం వీటిపై స్పష్టమైన ఆదేశాలిస్తూ, అదనపు వసూళ్లకు పాల్పడే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది.

దూరాన్ని బట్టి చార్జీలు

గ్యాస్ ఏజెన్సీ నుంచి 5.కి.మీ. దూరం వరకు ఎలాంటి చార్జీలు వసూలు చేయకూడదు. 5 కి.మీ. నుంచి 15 కి.మీ. వరకు కేవలం రూ.20 మాత్రమే తీసుకోవాలి. గ్యాస్ ఏజెన్సీ నుంచి దూరం 15 కి.మీ. దాటితే మాత్రం సిలెండర్‌కు రూ.30 వసూలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలకు కల్పించింది. అంతకు మించి ఒక్క రూపాయి కూడా తీసుకోవడానికి వీల్లేదు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్

వంట గ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ డెలివరీకి బిల్లులో ఉన్న మొత్తం కన్నా అదనంగా డబ్బులు అడిగితే వినియోగదారులు కాల్ సెంటర్/టోల్ ఫ్రీ నెంబర్ 1967, 18002333555కు ఫిర్యాదు చేయొచ్చు. వినియోగదారులు సిలండర్ డెలివరీ బిల్లులో ఉన్న ధర మాత్రమే చెల్లించాలి. 5 కి.మీ.లోపు ఎలాంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన పనిలేదు.

వసూళ్లు రూ.22 లక్షలకు పైనే

అనకాపల్లి మండల పరిధిలో 32 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో సుమారు 45 వేల గ్యాస్ కనెక్షన్లున్నట్టు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో సగటున రెండు మాసాలకోసారి సిలండర్లు బుక్ చేసుకుంటారని ఏజెన్సీ నిర్వాహకులు చెప్తున్నారు. ఇలా చూసినా.. ఒక్కో సిలెండర్‌కు రూ.50 చొప్పున ఏకంగా రూ.22.50 లక్షల వరకు వినియోగదారుల జేబుకు చిల్లు పడుతోందని అంచనా. కొన్ని చోట్ల ఏజెన్సీ నిర్వాహకులకు కూడా ఈ వసూళ్లలో వాటా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. చాలా వరకు ఈ మొత్తం గ్యాస్ డెలివరీ బాయ్స్ జేబుల్లోకే చేరుతుందనడంలో సందేహం లేదు.

తప్పనిసరి కాదు.. అయినా..!

పట్టణంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలకు మండలంలోని అన్ని గ్రామాలు దాదాపు 10 కి.మీ. పరిధిలోపే ఉన్నాయి. అయినప్పటికీ డెలివరీ చార్జీల పేరుతో ఒక్కో గ్యాస్ సెలిండర్‌పై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నట్టు స్థానికులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై గ్యాస్ ఏజెన్సీలు ఎంతమేరకు సహకరిస్తాయన్నది కూడా ప్రశ్నార్థకమే. డెలివరీ బాయ్స్‌కు అదనంగా ఇవ్వాలని ఏనాడూ.. తాము చెప్పట్లేదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వాదన. వినియోగదారులే ఇస్తున్నారు తప్ప.. తమ నిర్బంధం లేదంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డెలివరీ బాయ్స్‌కు జీతాలు చెల్లిస్తున్నట్టు చెప్తున్నారు. డెలివరీ బాయ్స్ వాదన మరోలా ఉంది. సిలిండర్‌పై జనాలిచ్చేదే తప్ప, ఏజెన్సీ నిర్వాహకులు తమకు జీతాలు పెద్దగా ఇవ్వరని, వాటితో తామెలా బ్రతికేదని చెప్తున్నారు.

> **రూ.50 చెల్లించాల్సిందే..!**
>
> గ్యాస్ బుక్ చేసుకున్న కొద్ది రోజులకే ఇంటికి గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ బాయ్ తెస్తున్నాడు. బిల్లులో ఉన్న మొత్తంతోపాటు అదనంగా ఒక్కో బండకు రూ.50 తీసుకుంటున్నారు. ఇక నుంచి అదనపు చార్జీలు చెల్లించక్కర్లేదన్న ప్రభుత్వ నిర్ణయం చాలా మంచిది. ఇది పక్కాగా అమలయ్యేలా చూడాలి.
>
> – కె.లక్ష్మి, గృహిణి, రేబాక

నేటి నుంచి దేవీతల్లి తీర్థం

వాల్‌పోస్టర్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం బూడి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి(తీర్థ) కల్యాణ మహోత్సవాల వాల్ పోస్టర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ఆయన్ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. తొలి రోజు బుధవారం భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమై ఈ నెల 5వ తేదీతో ముగిస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 4న జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు, 5న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆఖరి రెండు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితా ప్రసాద్, రైవాడ మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు పాల్గొన్నారు.

5న ఆర్టీసీ కాంప్లెక్స్ పునఃప్రారంభం

ఆధునీకరించిన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఈ నెల 5వ తేదీన పునః ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చేపడుతున్న ఆధునీకరణ పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఇక్కడ సామాజిక మరుగుదొడ్లు నిర్మాణాలను పక్కా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణను ఆదేశించారు. అనంతరం నూతన ఎంపీడీవో భవన నిర్మాణ పనులను పరిశీలించి, స్థానిక మండల ఇంజినీర్ ఉమామహేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

బీజేపీ జిల్లా కార్యాలయం ప్రారంభం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక చదువులవారివీధిలో బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వైద్యుడు జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన ద్వారపురెడ్డి పరమేశ్వరరరావు బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కార్యవర్గ సమావేశం, సాయంత్రం 5 గంటలకు స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో డేటా మేనేజ్‌మెంట్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కర్రి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఉడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో సందడిగా గాంధీ తీర్థం

మాడుగుల రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ తీర్థం మంగళవారం కె.జె.పురంలో ఘనంగా నిర్వహించారు. ఏటా గాంధీ వర్ధంతి మరుసటి రోజు ఈ తీర్థం నిర్వహించడం పరిపాటి. ఈ సందర్భంగా గాంధీ వీధిలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ జామి రమణబాబు, పాలకవర్గ సభ్యులు, వీధి వాసులు, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కబడ్డీ, ముగ్గులు, సైకిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దాడి రాము సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బీశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.